

కనుల పండువగా జాతర

జల్‌పల్లి మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ ఆలయం జాతర సందర్భంగా ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. 8లో▸



వ్యభిచార గృహాలుగా..

నగర శివారు ప్రాంతాల్లో నిర్మించుకుంటున్న ఫాంహౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. 8లో▸



షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన అనాజ్‌పూర్‌లో చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

మొయినాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 22 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 7,193 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోగా ఆదివారం నిర్వహించిన పరీక్షకు 6,746 మంది హాజరైనట్లు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను ఆమె సందర్శించి పరీక్ష నిర్వహించిన తీరును, ఏర్పాట్లను పరిశీలించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా సుధాకర్



పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి నుంచి నియామకపత్రం అందుకుంటున్న సుధాకర్

యాచారం: మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన వరికుప్పల సుధాకర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామకపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశీస్సులతో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని సుధాకర్ పేర్కొన్నారు.

యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా నరేష్



తుర్కయంజాల్: బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రావులకోలు నరేష్ ప్రజాపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఓబీసీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించినట్లు నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో కారు బీభత్సం



పల్టీలు కొట్టిన కార్లు

శంషాబాద్: ఆగిఉన్న కారును మరో కారు ఢీకొట్టిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున విమానాశ్రయంలోని మొదటి రోటరీ సమీపంలో హైదరాబాద్ వైపు వస్తున్న ఓ కారు డ్రైవర్ వాహనాన్ని నిలిపాడు. వెనక వేగంగా వచ్చిన మరో కారు ఆగి ఉన్న కారును గమనించకుండా ఢీకొట్టడంతో రెండు కార్లు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న గుంతలోకి పడిపోయి నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో నిలిపి ఉన్న కారులోని వ్యక్తి గాయాలయ్యాయి. ఢీకొన్న కారులోని నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. రోడ్డుపై బీభత్సం సృష్టించడంతో వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని కార్లను తొలగించడంతో పాటు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వెనక నుంచి కారును ఢీకొట్టిన వారు మద్యం మత్తులో ఉన్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కేంద్ర మంత్రి రాక

మోమిన్‌పేట: మండల పరిధిలోని చీమల్‌దరి గ్రామంలో కేంద్ర సమాచార శాఖ మంత్రి దేవ్ సిన్హ్‌చౌహాన్ మంగళవారం పర్యటించనున్నట్లు మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో అభివృద్ధి పనులు పరిశీలిస్తారని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా బీఎస్‌ఎన్‌ఎల్‌తో చీమల్‌దరి పంచాయతీ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామంలో ఉచిత వైఫై, ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం, ల్యాండ్ లైన్ కనెక్షన్, ఆధార్ కేంద్రం పనితీరు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో డిజిటల్ బోధన తదితరాలపై వివరిస్తామన్నారు.

అంతా గుంభనం!



పారదర్శకతకు పాతర.. అవినీతి జాతర

- 58, 59 జీఓ, ధరణి దరఖాస్తులపై నిర్లక్ష్యం
- వివరాలు దాచిపెడుతున్న అధికారులు
- ఆర్టీఐలో దరఖాస్తు చేసినా ఇచ్చేందుకు నిరాకరణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాం.. అవినీతికి ఆస్కారం లేకుండా చేస్తున్నాం.. జవాబుదారీతనాన్ని పెంపొందిస్తున్నాం' అంటూ గొప్పలు చెప్పుకొంటున్న ఉన్నతాధికారులు కీలక విషయాల్లో మాత్రం గోప్యతను ప్రదర్శిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 58,59లను అవకాశంగా తీసుకుని నిర్మాణంలో లేని ఖాళీ భూములను అక్రమార్కులు కొల్లగొట్టారు. శేరిలింగంపల్లి, వట్టినాగులపల్లి, నార్సింగి, గోపన్‌పల్లి, శంషాబాద్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, రాజేంద్రనగర్, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, బాలాపూర్ మండలాల్లో విలువైన ప్రభుత్వ భూములను మాయం చేశారు.

ఎవరికివారు దాటవేస్తూ..

58,59 జీఓల కింద ప్రభుత్వానికి జిల్లాలోని 27 మండలాల నుంచి సుమారు 60 వేల దరఖాస్తులు అందాయి. వీటిలో ఇప్పటి వరకు ఎన్ని ఆమోదం పొందాయి.. ఎన్ని ఎకరాల భూమిని క్రమబద్ధీకరించారు.. ప్రభుత్వానికి ఎంత ఆదాయం సమకూరింది? వంటి కనీస వివరాలు కూడా సంబంధిత అధికారుల వద్ద లేవంటే వారి పనితీరుకు అద్దం పడుతోంది. అదేమంటే సీసీఎల్‌ఏ సంబంధిత ఆన్‌లైన్ సైట్‌ను తాత్కాలికంగా నిలిపివేసిందని చెప్పి ఎవరికి వారు తప్పించుకుంటున్నారు. అక్రమార్కుల వివరాలు బయటికి రాకుండా కాపాడుతున్నారు. ఈ విషయంలో కలెక్టర్ ఈ సెక్షన్, అదనపు కలెక్టర్ పేరు చెప్పి దాట వేస్తుండగా, వారు సైతం అదే పేరుతో సమాచారం ఇచ్చేందుకు నిరాకరిస్తుండటం గమనార్హం.

ఆ భూముల వివరాలు లేవట..

జిల్లాలో ఏ మండలంలో ఎన్ని ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ భూములు ఉన్నాయి.. వీటిలో ఇప్పటి వరకు ఎన్ని కబ్జా అయ్యాయి.. ఈ భూములపై వివిధ కోర్టుల్లో నడుస్తున్న కేసులు ఎన్ని.. కోర్టు తీర్పులు అమలు చేశారా? వంటి కనీస సమాచారం కూడా లభించడం లేదు. ఉన్నతాధికారిని ఆరా తీస్తే.. కింది సెక్షన్ల పేరు చెప్పి తప్పించుకుంటుండగా, ఆయా సెక్షన్ల అధికారులు ఉన్నతాధికారి పేరు చెప్పి తప్పించుకుంటున్నారు. ఆర్టీఐ కింద దరఖాస్తు చేసిన వారికి కూడా పూర్తి స్థాయి సమాచారం ఇవ్వడం లేదు. మీరడిగిన సమాచారంలో పబ్లిక్ ఇంట్రెస్ట్ లేదని చెప్పి.. సమాచారం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.

బయటికి రానివ్వకుండా..

భూ సంబంధిత సమస్యలపై ధరణి పోర్టల్‌కు 1.90 లక్షలకుపైగా దరఖాస్తులు అందగా, వీటిలో ఇప్పటికీ 35 వేలకుపైగా పెండింగ్‌లోనే ఉన్నట్లు సమాచారం. వీటిలో ఏ సమస్యకు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే కనీస సమాచారాన్ని కూడా బయటికి రానివ్వకుండా తొక్కిపెడుతున్నారు. అంతేకాదు వివాదాస్పద భూములకు సంబంధించి గత కలెక్టర్ క్లియర్ చేసిన 98 దరఖాస్తులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై కూడా సమాధానం లేదు. ఉన్నతాధికారుల మెడకు ఈ కేసు చుట్టుకునే అవకాశం ఉండటంతో మొదట్లోనే దీన్ని తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది.

ప్రజావాణి దరఖాస్తుల లెక్క లేదు

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కోవిడ్‌తో తాత్కాలికంగా ఆగిన ఈ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం తర్వాత మళ్లీ మొదలైంది. 2022 సెప్టెంబర్ నుంచి కొనసాగుతోంది. ప్రతి వారం 250–300 మంది వస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల్లో ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారు అనే దానికి కూడా ఆయా అధికారుల వద్ద కనీస సమాధానం లేదు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే అంశంపై స్పష్టత లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అధికారులు ఎంత తేలిగ్గా తీసుకుంటున్నారో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.



చేగూరులో పర్యటిస్తున్న సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

లక్ష్మీదేవిపల్లిని నిర్లక్ష్యం చేశారు

- ఈ పాపం గత ప్రభుత్వానిదే..
- సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొందుర్గు మండలంలో నిర్మించతలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు ముందుకెళ్లకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. కొత్తూరు, నందిగామ మండలాల్లో ఆదివారం నిర్వహించిన పాలమూరు న్యాయయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. జిల్లా నుంచి వందల కిలోమీటర్ల మేర కృష్ణా నది ప్రవహిస్తున్నా కొత్తగా ఒక్క ప్రాజెక్టును కూడా ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. పక్కనే నదులు ప్రవహిస్తున్నా జిల్లావాసులు సాగు, తాగునీటికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలు, ఇతర సంస్థలు ఉన్నప్పటికీ స్థానికులకు అందులో ఉపాధి కల్పించడంలో అప్పటి పాలకులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా సొంత ప్రాంతాలను వదిలి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి ఇబ్బందులు పడ్డట్లు గుర్తు చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపడుతున్న యాత్రకు స్ఫూర్తిగా చేపట్టిన పాలమూరు న్యాయయాత్రలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు వంశీచంద్‌రెడ్డి వెల్లడించారు. యాత్రలో భాగంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నందిగామలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌మ్యాచ్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ శ్యాంసుందర్‌రెడ్డి, నందిగామ ఎంపీపీ ప్రియాంక, నాయకులు హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, తులసీరాంనాయక్, కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాంతకుమార్

ఇదేనా సంక్షేమ బడ్జెట్?

- అరకొర నిధులతో సరిపెట్టారు
- ఆయా హామీలపై స్పష్టత కరువు
- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్

షాద్‌నగర్: ప్రజా సంక్షేమానికి బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించిందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ విమర్శించారు. పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలకు రూ.5లక్షల కోట్లకు పైగా అవసరం ఉంటే రూ.53వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తామని, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ రంగాలకు గతంలో కంటే తక్కువ నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు అందజేస్తామని ఎన్నికల ముందు చెప్పి బడ్జెట్‌లో ఎందుకు ప్రస్తావించలేదని ఆయన ప్రశ్నించారు. బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని.. బడ్జెట్‌లో రూ.8వేల కోట్లు మాత్రమే కేటాయిస్తున్నట్లు ప్రకటించడం మోసం చేయడమేనన్నారు. ఉద్యకారులను గుర్తించి, వారి కుటుంబాలకు నెలవారీ గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని అన్నారు. తొలి కేబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు పోస్టుల భర్తీపై స్పష్టత లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లిస్తామని, ఇంటి స్థలం ఉంటే ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సరిగా లేకపోవడాన్ని చూస్తుంటే హామీలను విస్మరించే ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పినా ఎందుకు నిధులు కేటాయించలేదని నిలదీశారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని, తిరిగి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, చెంది మహేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ, శంకర్‌నాయక్, హరి భూషణ్ పద్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

పక్కాగా సాగు లెక్క

- కొనసాగుతున్న పంటల వివరాల సేకరణ
- 'క్షేత్ర' స్థాయిలో పర్యటిస్తున్న ఏఈఓలు
- ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు
- రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లో సులువుగా విక్రయించేందుకు దోహదం



కుర్వగూడలో పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ లిఖిత

షాబాద్: రైతులు పండించిన పంటను మార్కెట్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించేందుకు పంటల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ముమ్మరంగా కొనసాగిస్తోంది. గ్రామాల్లో ఏ రైతు.. ఏ సర్వే నంబర్‌లో.. ఏ పంట వేశాడో అనే వివరాలు సేకరిస్తోంది. పంటల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 99,306 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 29,466 ఎకరాల్లో సాగు చేశారు. ఈ నెల చివరి వరకు వరితో పాటు ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటల సాగు వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వీటి ఆధారంగానే రానున్న రోజుల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

5వేల ఎకరాలకు ఒక క్లస్టర్

జిల్లావ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు(కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని 23 మండలాల్లో ఈ ఏడాది యాసంగి సీజన్‌కుగాను 99,306 ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 29,466 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటల్లో ఇప్పటికే 20,888 ఎకరాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 83 మంది ఏఈఓలు ప్రతి గ్రామంలో వివరాలు సేకరిస్తున్నారు. 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా విభజించి, ఆ పరిధిలో వివరాల సేకరణ బాధ్యత ఏఈఓలకు అప్పగించారు.

ఈ నెల చివరి వరకు సేకరణ

రైతులు సాగు చేసిన పంటల వివరాలను సేకరించిన ఏఈఓలు వారి ఫోన్ నంబర్లు కూడా నమోదు చేస్తున్నారు. ప్రతి గుంటలో సాగు చేసిన పంటల పూర్తి వివరాలు పకడ్బందీగా సేకరిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో ఏ గ్రామంలో, ఏ రైతు, ఏ పంట, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో తెలిసిపోతుంది. ఈ నెల చివరి వరకు పంటల సాగు సేకరణ వివరాలు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వివరాలుంటేనే కొనుగోలు

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదైన పంటల వివరాల ప్రకారమే ఆయా రైతుల పంటల దిగుబడుల కొనుగోలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుంది. ఎఫ్‌సీఐ, మార్క్‌ఫెడ్, ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా రైతుల నుంచి వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటల దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఆన్‌లైన్‌లో వివరాలు లేని రైతుల నుంచి దిగుబడుల కొనుగోలును నిరాకరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తాము సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పకడ్బందీగా పంటల నమోదు



జిల్లాలో పంటల సాగు వివరాల సేకరణ పకడ్బందీగా కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం సేకరించిన వివరాల ఆధారంగానే పంటల ఉత్పత్తులు మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుంది.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సుగ్రంథ పరిమళాలు

- మూడో రోజుకు చేరిన పుస్తక ప్రదర్శన
- భారీగా తరలివచ్చిన సందర్శకులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- సందడిగా మారిన ఎన్టీఆర్ స్టేడియం

సాక్షి, సిటీబ్యూరో: పుస్తక ప్రదర్శనకు సందర్శకుల రద్దీ పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లలు, పెద్దలు, కుటుంబాలతో సహా తరలివచ్చారు. పుస్తక ప్రియులతో స్టాళ్లు కళకళలాడాయి. ఈ నెల 9న మొదటి రోజు పూర్తిస్థాయిలో స్టాళ్లు ఏర్పాటు కాలేదు. శనివారం కొద్దిగా రద్దీ కనిపించింది. కానీ మూడో రోజైన ఆదివారం సాయంత్రం సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పుస్తకానికి ఏ మాత్రం ఆదరణ చెక్కుచెదరలేదని నిరూపిస్తూ పాఠకలోకం కదిలివచ్చింది. మరోవైపు బుక్‌ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్య వేదిక పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించింది.

చిన్న వయసులోనే కథలు రాసి..

ఆదిలాబాద్ జిల్లా రూరల్ మండలం యాపల్‌గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఆంగ్లంలో రాసిన కథల పుస్తకం ద స్టోరీస్ ఆఫ్ యాపల్‌గూడ చిల్డ్రన్ పుస్తకాన్ని బాల సాహితీవేత్తలు వీఆర్ శర్మ, చొక్కాపు వెంకటరమణ, బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షుడు కోయ చంద్రమోహన్, రమా శాండిల్య ఆవిష్కరించారు. అతి చిన్న వయసులో చక్కటి కథలు రాసిన విద్యార్థులకు బుక్ ఫెయిర్ నిర్వాహకులు ప్రశంసా పత్రాలను అందజేశారు.



తరగని ఆసక్తి..

మరోవైపు చరిత్ర, కళలు, సాహిత్య గ్రంథాలకే పాఠకులు అగ్రస్థానం ఇస్తున్నారు. దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్లు, జీవన యానం, జనపథం.. రాహుల్ సాంకృత్యాయన్ మధుర స్వప్నం, ఓల్గా నుంచి గంగ వరకు, శ్రీశ్రీ మహాప్రస్థానం వంటి పుస్తకాలతో పాటు చందమామ కథలు, పంచతంత్ర కథలు, పెద్దబాలశిక్ష వంటి పుస్తకాలకు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదు. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, చేగువేరా గ్రంథాలను కూడా పాఠకులు ఆసక్తిగా తీసుకుంటున్నారు. చలం సాహిత్యం అమ్మకాల్లో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. వీటితో పాటు రామాయణం, మహాభారతం, భాగవతం వంటి ఇతిహాస గ్రంథాలు, ఆధ్యాత్మిక, తాత్విక, పరిశోధనాత్మక పుస్తకాలను పాఠకులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు పలువురు పబ్లిషర్లు తెలిపారు. సినీనటుడు బ్రహ్మానందం ఆత్మకథ 'నేను' పుస్తకం అన్వీక్షికి స్టాల్‌లో అందుబాటులో ఉంది.

తెలంగాణ కొత్త పుస్తకాలు..

స్టాల్ నంబర్ 51లో ఏర్పాటు చేసిన తెలంగాణ బుక్ ట్రస్ట్ సరికొత్త పుస్తకాలను అందుబాటులోకి తెచ్చింది. వర్ధమాన రచయితల పుస్తకాలతో పాటు ప్రముఖుల రచనలు కూడా ఉన్నాయి. ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఇటీవల రాసిన 'ది క్లాష్ ఆఫ్ కల్చర్స్'కు అనూహ్య స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు చంద్రమోహన్ తెలిపారు. 'మిగుల్చుకున్న వాక్యాలు కొన్ని.. మనుషుల్రా మనుషులు, ఊహ చేద్దాం రండి, నర్సంపేట కథలు, నెవర్ ఎండ్' వంటి పుస్తకాలు ఈ స్టాల్‌లో కొలువుదీరాయి. అంపశయ్య నవీన్, సంగిశెట్టిల సమగ్రసాహిత్యం అందుబాటులో ఉంది. అందెశ్రీ నిప్పులవాగు వంటి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. గోర్కీ అమ్మ నవల మొదలుకొని చారిత్రక భౌతిక వాదం వరకు, మానవుడి పుట్టుక, డార్విన్ జీవ పరిణామ వాదం నుంచి జినోమ్ వరకు అనేక రంగాలకు చెందిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: దేశ వ్యాప్తంగా ఈనెల 16న నిర్వహిస్తున్న కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామస్వామి అన్నారు. మండలకేంద్రంలోని ఆర్‌అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద ఆదివారం కార్మిక సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ.. కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కనీస వేతనాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకోసం అన్ని కార్మిక సంఘాలు కలిసి దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమ్మెను విజయవంతం చేసి కార్మికులు, కర్షకుల సత్తాను చాటాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎం. ప్రభులింగం, నర్సింలు, అంజయ్య, వెంకటయ్య, అంజయ్య, ఆనందం, వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహాలుగా ఫాంహౌస్‌లు!

- అద్దెకు తీసుకుని గుట్టుగా సాగిస్తున్న నిర్వాహకులు
- ఇతర ప్రాంతాల మహిళలను రొంపిలోకి దింపుతున్న వైనం
- పెడదారి పడుతున్న యువకులు


వ్యభిచారం నిర్వహిస్తున్న ఫాంహౌస్

మొయినాబాద్: వారాంతపు విడిదిలు వ్యభిచార గృహాలుగా మారుతున్నాయి. వీకెండ్‌లో సరదాగా గడపడానికంటూ నగర శివారు ప్రాంతాల్లో నిర్మించుకుంటున్న ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. అప్పుడప్పుడు పోలీసులు దాడిచేసి గుట్టురట్టు చేస్తున్నా మళ్లీ కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు ఫాంహౌస్‌లను లీజ్‌కు తీసుకుని వ్యభిచారం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో వాటికి ఆకర్షితులై యువత పెడదారి పడుతుంది. హైదరాబాద్ శివారుల్లోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో చాలా మంది బడాబాబులు ఫాంహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. 111 జీఓ పరిధిలో ఉన్న మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్ మండలాల్లో ఫాంహౌస్‌లు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఒక్క మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికి పైగా ఫాంహౌస్‌లున్నాయి. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలంలో చాలా మంది 10 గుంటల నుంచి 1 ఎకరం వరకు భూమి కొనుగోలు చేసి అందులో ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. వీకెండ్స్‌లో పిల్లలతో ఎంజాయ్ చేయడానికి ఫాంహౌస్‌లు నిర్మించుకుని తర్వాత వాటిని ఇతరులకు లీజుకు, అద్దెకు ఇస్తున్నారు.

నిర్వాహకుల అడ్డగోలు దందా..

ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకున్న నిర్వాహకులు అడ్డగోలు దందాలు చేస్తున్నారు. గెట్ టూ గెదర్ పార్టీలు, ఫ్యామిలీ పార్టీలు, బర్త్‌డేలంటూ రోజువారీగా అద్దెకు ఇస్తున్నారు. ఫాంహౌస్‌లకు వచ్చే యువకులను ఆకర్షించే విధంగా ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి ఫాంహౌస్‌లలో ఉంచుతున్నారు. అమ్మాయిలను వ్యభిచారం రొంపిలోకి దింపి యువకుల దగ్గర డబ్బులు దండుకుంటున్నారు. మొయినాబాద్ మండలంలోని కనకమామిడి, చాకలిగూడ, సురంగల్, శ్రీరాంనగర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, బాకారం, అమ్డాపూర్ తదితర గ్రామాల పరిధిలో ఉన్న ఫాంహౌస్‌లలో ఈ దందాలు జోరుగా కొనసాగుతున్నాయి.

నిఘా వైఫల్యం!

ఫాంహౌస్‌ల్లో జరుగుతున్న వ్యభిచారం, అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల నిఘా వైఫల్యమే కారణమని తెలుస్తుంది. ఫాంహౌస్‌లపై నిఘా పెట్టాల్సిన పోలీసులు నిర్వాహకులతో మిలాకత్ అవుతున్నట్లు సమాచారం. అందుకే ఫాంహౌస్‌ల్లో రాత్రిపూట ఎంత హంగామా జరిగినా పోలీసులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఎలుకగూడ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహించడం వల్ల యువకుల మధ్య జరిగిన గొడవలు ఓ యువకుడి ఆత్మహత్యకు దారితీసినట్లు సమాచారం. అప్పడప్పుడు ఫాంహౌస్‌లపై జరుగుతున్న దాడులు ఎస్‌ఓటీ పోలీసులు చేస్తున్నవే కావడం విశేషం.

వరుస ఘటనలు...

మొయినాబాద్ మండలంలోని ఫాంహౌస్‌ల్లో వరుసగా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆరు నెలల క్రితం కనకమామిడి రెవెన్యూలోని మ్యాంగోహుడ్ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. తాజాగా గురువారం రాత్రి కనకమామిడి రెవెన్యూ పరిధిలోని హ్యాపీహోంస్‌లో ఉన్న రాజు ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, ఓ వాచ్‌మెన్, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పేకాట స్థావరాలపై సైతం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేస్తున్నారు.

నిఘా పెంచుతాం



ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. అన్ని ఫాంహౌస్‌లకు నోటీసులు ఇస్తాం. ఫాంహౌస్‌లపై నిఘా పెంచుతాం. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ఫాంహౌస్‌లపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటాం.

–పవన్‌కుమార్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్

ద్విచక్ర వాహనం చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: దుకాణం ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల ప్రకారం మధుకర్‌గౌడ్ అనే వ్యక్తి తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ వద్ద దుకాణ ఎదుట బైక్‌ను పార్కింగ్ చేశాడు. ఈ నెల 2వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు పిల్లలు

అత్తాపూర్: తప్పిపోయిన ముగ్గురు పిల్లలను అత్తాపూర్ పోలీసులు గంటల వ్యవధిలోనే ఆచూకీ తెలుసుకొని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ పాండురంగానగర్‌కు చెందిన వెంకటేశ్ రాథోడ్ కుమారుడు విష్ణు (4), కూతురు ఈశ్వరీ (4), కుమారుడు ఈశ్వర్ (2) ఆదివారం ఉదయం తల్లి నల్లా నీటిని పడుతుండగా.. వీరు ఇంట్లో నుంచి వెళ్లి కనిపించకుండా పోయారు. దీంతో వారు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లల ఆచూకీ కోసం గాలించగా.. శ్రీ విద్యానికేతన్ స్కూల్ వద్ద కనిపించారు. పిల్లలను తీసుకొని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: భార్యతో గొడవపడి భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గా ఖలీల్ ఖాన్ ప్రాంతానికి చెందిన నరసింహాచారి (60) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. శనివారం భార్యతో గొడవ పడి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి భార్య పనికి వెళ్లింది. దీంతో నరసింహా చారి ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి వచ్చిన మనువడు చూసి తన తల్లికి తెలపడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ కొనుక్కొని వెళ్తుండగా..

యువకుడి మృతి ..ఒకరికి గాయాలు


భూతప్ప(ఫైల్)

ఇబ్రహీంపట్నం: కొత్తఫోన్ కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రామక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దొణకొండ మండలం, ఎర్రబాలెం గ్రామానికి చెందిన సగినాల భూతప్ప(30) బొంగుళూర్ గేట్ వద్ద నున్న శ్రీ చైతన్య కళాశాల క్యాంటిన్‌లో లేబర్‌గా పనిచేస్తుంటాడు. ఇబ్రహీంపట్నంలో కొత్త ఫోన్ కొనేందుకు బైక్‌పై తన స్నేహితుడు మర్రాపు వెంకటేశ్(33)ను వెంటబెట్టుకొని వచ్చాడు. ఫోన్ కొనుగోలు చేసి రాత్రి పదిన్నర గంటల సమయంలో తిరిగి వెళ్తుండగా ఉప్పరిగూడ గేట్ వద్ద రోడ్డు ప్రక్కకు ఉన్న డివైడర్‌ను బైక్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో భూతప్ప అక్కడికక్కడే మృతిచెందగా వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల ఆధార్‌కార్డు, హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ఆదివారం ప్రభుత్వం ప్రవేశ పరీక్షను నిర్వహించింది. ఈ వీటీజీ సెట్ పరీక్ష ఉ.11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాలయాలలో 5వ తరగతిలో ప్రవేశం పొందుటకు వీటీజీ సెట్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే చేరుకున్నారు. హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, బోనఫైడ్, పరీక్ష ప్యాడ్ తనిఖీచేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. కమ్మదనం గురుకుల బాలికల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో 480 మంది విద్యార్థులకుగాను 438 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బాలురు 236 మందికి గాను 214 మంది, బాలికలు 244 మందికిగాను 224మంది హాజరయ్యారు. అలాగే సాంఘిక సంక్షేమ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో 312 మంది విద్యార్థులకుగాను 286 మంది పరీక్షకు హాజరు కాగా 26మంది గైర్హాజరయ్యారు. బాలురు 149 మందికిగాను 133 మంది, బాలికలు 163మందికి గాను 153 మంది హాజరయ్యారు. కమ్మదనం పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌గా ప్రసన్న, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా వీణ, గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో సిట్టింగ్ స్క్వాడ్‌గా గంగ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా భార్గవి వ్యవహరించారు. వీటీజీ సెట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కావాల్సిన చర్యలను అధికారులు చేపట్టారు.

అక్రమంగా ఆవు, లేగదూడల తరలింపు

పోలీసుల అదుపులో నిందితులు

ఆమనగల్లు: ఎలాంటి అనుమతులు లేకుండా ఆవు, మూడు లేగ దూడలను తరలిస్తుండగా ఆమనగల్లు పోలీసులు పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలరాము తెలిపారు. కల్వకుర్తి నుంచి ఆటోలో ఒక ఆవు మూడు లేగ దూడలను కుక్కి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా ఆటోను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆవు, లేగ దూడలు తరలిస్తుండంతో ఆటో డ్రైవర్ రవి, హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ మతిన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కనుల పండువగా గరిగుట్ట పెద్దమ్మ జాతర


సమ్మక్క సారమ్మలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న శివసత్తులు


గరిగుట్ట పెద్దమ్మ తల్లి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారి 46వ కల్యాణ మహోత్సవాల(జాతర)లో భాగంగా ఆదివారం అమ్మవారి తొట్టెల ఊరేగింపును ధర్మకర్త విఠల్‌బాబా పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాల నడుమ మహిళలు సంప్రదాయ వస్త్రాధారణతో బోనాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి వడిబియ్యాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న సమ్మక్క, సారక్కల దిమ్మెల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి, ఎస్సై భాస్కర్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

ఐఏఎస్‌లపై చర్యలు తీసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ తెరవెనక ఉన్న ఐఏఎస్ అధికారులను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్యా రాము నాయక్, మాజీ కౌన్సిలర్ పత్తిపాక రాజ్ నాయక్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న శివ బాలకృష్ణ అవినీతి భాగోతంలో ఎందరో ఉన్నతాధికారుల పాత్ర ఉందన్నారు.పలువురు ఐఏఎస్ అధికారులు, ప్లానింగ్ విభాగం అధికారులు రూ. వందల కోట్ల విలువైన భూములకు ఎడాపెడా అక్రమ అనుమతులు ఇచ్చేసి రూ.కోట్లల్లో దండుకున్నారని ఆరోపించారు. సదరు అధికారులపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ఫార్ములా–ఈ కార్ రేసింగ్ పేరుతో రూ.53 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన అప్పటి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండల అనాజ్‌పూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి విజయలక్ష్మి అనే మహిళ కుమారుడితో కలిసి అనాజ్‌పూర్ ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు వ్యాపించాయి. దీంతో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగి భారీ శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో వస్తువులు, నగదు కాలిపోయాయి. స్థానికుల పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ సహాయంలో మంటలను ఆర్పారు. బాధితురాలికి తక్షణ సహాయం కింద రూ. 5వేలు తహసీల్దార్ రవీందర్ దత్తు అందజేశారు.

మహేశ్‌కు గోల్డ్ మెడల్

- అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా
- అభినందించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్


మహేశ్‌కు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్

తలకొండపల్లి: అంతర్జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో కరాటే మాస్టర్ మహేశ్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఆదివారం శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్‌ను స్పీకర్ అభినందించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. ఎంపిక చేసుకున్న రంగంలో రాణించాలంటే అంకితభావంతో పని చేయాలన్నారు. నేటి సమాజంలో మనల్ని మనం కాపాడుకోవాలంటే ప్రతి మనిషికి కరాటే అవసరమని అభిప్రాయపడ్డారు. మనం చేసే పనిని ప్రేమిస్తూ, గురువుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగితే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.

కరాటే మాస్టర్ అమర్‌సింగ్ నేతృత్వంలో..

వరల్డ్ నకాయమ్మ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ అమర్‌సింగ్ నేతృత్వంలో జనవరి 28న హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కటాస్, ఫైట్‌లో 4,000 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన మహేశ్ పాల్గొన్నాడు. గెలుపొందిన మహేశ్‌కు బంగారు పతాకం, ప్రశంసా పత్రాన్ని స్పీకర్ అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు కేశవగౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, సాయి యాదవ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు


కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: త్వరలో మహేశ్వరంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు ఉంటాయని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. త్వరలో మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లతో పాటు సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల నుంచి భారీ ఎత్తున బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు వెంకటేష్ గౌడ్, నర్సింహ, మురళి, కన్నయ్య, నర్సింహ, శ్రీకాంత్, కొత్తమాస్ ప్రభాకర్, మల్లేష్, సామేల్, వెంకయ్య, శేఖర్, వినయ్, పవన్, నరేష్, యాదగిరి, హత్పు నాయక్ పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు ఇంద్రకంటి నర్సింహగౌడ్, కొమరయ్య, పాండు నాయక్, జంగయ్య,సోమేష్, శ్రీను, అల్లెకుమార్, తిరుపతయ్య పలువురు పాల్గొన్నారు.

కార్టూన్ కళను భావితరాలకు అందించాలి


కార్టూన్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి

హిమాయత్‌నగర్: కార్టూన్ల కళ ప్రాముఖ్యతను భావితరాలకు అందించాలని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ఒక గొప్ప సందేశాన్ని ఒక్క క్షణంలో అర్థవంతగా చూపించేది కార్టూన్ ఒక్కటే అన్నారు. ఆదివారం రాత్రి బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో బాచి, వాడ్రేవు, పద్మబాస్ కార్టూన్ పుస్తకాలు లేపాక్షి ఫాంట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్టూన్ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్టూన్లు తనకు చాలా ఇష్టమని, సినిమాల్లో వచ్చిన తర్వాత వాటిపై మరింత ఇష్టం పెరిగిందన్నారు. నేటి తరానికి కార్టూన్లకు ఉన్న విలువను తెలియజేయడానికి తమ ఇంట్లోనే పోటీలు నిర్వహించేవాడినని తెలిపారు. కార్యక్రమంలో సినీ హాస్యనటుడు గుండు సుదర్శన్, రమణ, కార్టూనిస్టు కూచి తదితరులు పాల్గొన్నారు.